## దేశ సంస్కృతీసంప్రదాయాలను కాపాడాలి

కొత్తపల్లి, డిసెంబర్ 29: మన దేశ సంస్కృతీసంప్రదాయాలను యువత కాపాడాలని కలెక్టర్ పమేలా సత్పతి పిలుపునిచ్చారు. నగరంలోని అంబేద్కర్ స్టేడియంలో శుక్రవారం జిల్లా యువజన, క్రీడాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి యువజనోత్సవ (యువ కళాకారుల ఎంపిక ) పోటీలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, యువతలోని ప్రతిభను వెలికి తీయడానికే యువజనోత్సవాలు దోహదపడుతాయన్నారు. కళాకారులు మన జిల్లా ఖ్యాతిని జాతీయస్థాయికి తీసుకెళ్లాలని సూచించారు. డీవైఎస్‌వో కీర్తి రాజమీరు మాట్లాడుతూ, వివేకానంద జయంతిని పురస్కరించుకొని జిల్లా స్థాయి యువజనోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అంతకుముందు కలెక్టర్ పమేలా సత్పతికి యువజన సంఘాల ప్రతినిధులు జ్ఞాపిక ఇచ్చి స్వాగతం పలికారు.

## ప్రజా పాలనతో ప్రజలకు పథకాలు చేరువ

- మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ

గన్నేరువరం: గునుకుల కొండాపూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

శంకరపట్నం/ గన్నేరువరం, డిసెంబర్ 29: ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువ చేసేందుకే తమ ప్రభుత్వం ప్రజా పాలన కార్యక్రమం చేపట్టినట్లు మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పేర్కొన్నారు. శుక్రవారం శంకరపట్నం మండలం ఆముదాలపల్లి, గన్నేరువరం మండలం గుండ్లపల్లి, గునుకుల కొండాపూర్ గ్రామాల్లో ప్రజా పాలనలో భాగంగా అభయహస్తం దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజా పాలన ద్వారా ఆరు పథకాల అమలుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమం జనవరి 6వ తేదీతో ముగిసినా, ఆ తర్వాత కూడా దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని స్పష్టం చేశారు. పైసా ఖర్చు లేకుండా ప్రజలకు దరఖాస్తులను అందుబాటులో ఉంచుతున్నట్లు వెల్లడించారు. తాను ఎమ్మెల్యేగా గెలిచాక శంకరపట్నం మండలానికి చెందిన నలుగురికి వైద్య సహాయం కోసం ఎల్‌వోసీలు అందజేసినట్లు తెలిపారు. గన్నేరువరం మండలం జంగపల్లిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఎమ్మెల్యే సందర్శించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, కస్తూర్బా గాంధీ విద్యాలయ నిర్మాణం కోసం అధికారులతో కలిసి స్థలాన్ని పరిశీలించారు. ఆయా కార్యక్రమాల్లో జడ్పీ సీఈవో పవన్‌కుమార్, శంకరపట్నం మండల ప్రత్యేకాధికారి దేవేందర్ రావు, తహసీల్దార్ అనుపమ, ఎంపీవో బషీరొద్దీన్, సర్పంచ్ మానస, ఉప సర్పంచ్ జంపయ్య, గన్నేరువరం ఎంపీపీ లింగాల మల్లారెడ్డి, పలు గ్రామాల సర్పంచులతోపాటు తహసీల్దార్ భిక్షపతి, ఎంపీడీవో స్వాతి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నియమాలపై అవగాహన

రాంనగర్, డిసెంబర్ 29: నగరంలో ట్రాఫిక్ నియంత్రణ చర్యల్లో భాగంగా ఆటో డ్రైవర్లకు పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. కమిషనరేట్ కేంద్రంలో జాన్ విల్సన్ ఓపెన్ ఎయిర్ థియేటర్ అడిషనల్ డీసీపీ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో కార్యక్రమం కొనసాగింది. ఏసీపీలు నరేందర్, కరుణాకర్‌రావు, సర్వర్, సిబ్బంది, ఆటో డ్రైవర్లు, తదితరులు పాల్గొన్నారు.

గంగాధర: మండల కేంద్రంలో దరఖాస్తుల స్వీకరణ గురించి అడిగి తెలుసుకుంటున్న అడిషనల్ కలెక్టర్ ప్రపుల్ దేశాయ్

మానకొండూర్‌రూరల్: గంగిపల్లిలో వచ్చిన దరఖాస్తుల గురించి సర్పంచ్ మాశం శాలినిని అడిగి తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్

హుజూరాబాద్‌టౌన్: దరఖాస్తును స్వీకరిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక, ఆర్డీవో రాజు, తదితరులు

# కొనసాగుతున్న 'ప్రజాపాలన'

- రెండో రోజూ వెల్లువెత్తిన దరఖాస్తులు
- ఆయా చోట్ల పర్యవేక్షించిన అదనపు కలెక్టర్లు ప్రపుల్‌దేశాయ్, లక్ష్మీకిరణ్

చొప్పదండి: పట్టణంలోని 4వ వార్డులో దరఖాస్తు స్వీకరిస్తున్న మున్సిపల్ కమిషనర్

కార్పొరేషన్/హుజూరాబాద్ టౌన్/ జమ్మికుంట/ వీణవంక/ సైదాపూర్/ఇల్లందకుంట/ గంగాధర/ శంకరపట్నం/ చిగురుమామిడి/కరీంనగర్‌రూరల్/ మానకొండూర్ రూరల్/ చొప్పదండి/ తిమ్మాపూర్, డిసెంబర్ 29: కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమలుకు చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమం జిల్లా వ్యాప్తంగా కొనసాగుతున్నది. ఇందులో భాగంగా రెండో రోజు శుక్రవారం నిర్వహించిన వార్డు, గ్రామ సభల్లో ప్రజల నుంచి దరఖాస్తులు వెల్లువెత్తాయి. కాగా, జిల్లా కేంద్రంలోని 60 డివిజన్లలో మున్సిపల్ అధికారులు ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. రేకుర్తి, సీతారాంపూర్, ఆరెపల్లి, గోదాంగడ్డ, వావిలాలపల్లి, అల్గునూర్, తీగలగుట్టపల్లి, అంబేద్కర్ నగర్, సుభాష్‌నగర్, బుట్టిరాజారాం కాలనీ, తదితర ప్రాంతాల్లోని కేంద్రాలకు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అందుకు అనుగుణంగా అధికారులు ఏర్పాట్లు చేశారు. వృద్ధులు, దివ్యాంగుల కోసం ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేశారు. అలాగే, జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని 30 వార్డు కేంద్రాల్లో.. మండలంలోని కోరపల్లి, మడిపల్లి, మాచనపల్లి, నాగారం గ్రామాల్లోని పంచాయతీ కార్యాలయాల ఆవరణలో ప్రజా పాలన సాఫీగా సాగింది. మున్సిపల్, మండల ప్రత్యేకాధికారులు జనార్దన్‌రావు, నవీన్‌కుమార్ పర్యవేక్షణలో సిబ్బంది ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. మండలంలోని నాలుగు గ్రామాల్లో తహసీల్దార్ రజిని, ఎంపీడీవో కల్పన కార్యాలయ ఆవరణలో ప్రజలకు ప్రజా పాలనపై అవగాహన కల్పించారు. హుజూరాబాద్ మున్సిపల్ పరిధిలోని 30 వార్డుల్లో శుక్రవారం 4 గంటల వరకు 2,242 దరఖాస్తులు స్వీకరించినట్లు చైర్‌పర్సన్ గందె రాధిక, కమిషనర్ సమ్మయ్య తెలిపారు. ఈ కార్యక్రమాల్లో హుజూరాబాద్ రెవెన్యూ డివిజనల్ అధికారి ఎస్ రాజు, హుజూరాబాద్ నియోజకవర్గ ప్రత్యేకాధికారి శ్రీధర్, ప్రజాపాలన కార్యక్రమ ప్రత్యేకాధికారి పద్మావతి, వైస్ చైర్‌పర్సన్ కొలిపాక నిర్మల, కౌన్సిలర్లు, పాల్గొన్నారు. వీణవంక మండలం నర్సింగాపూర్‌లో 830 మంది, బేతిగల్‌లో 700 మంది, బొంతుపల్లిలో 350 మంది దరఖాస్తు చేసుకున్నారని తహసీల్దార్ తిరుమల్ రావు, ఎంపీడీవో కే శ్రీనివాస్ తెలిపారు. మండల ప్రత్యేకాధికారి డీఈ పీఆర్ మహేశ్వర్, ఎంపీవో ప్రభాకర్, డీటీ శ్రీనివాస్ రెడ్డి, సర్పంచులు మోరె సారయ్య, చదువు లక్ష్మి-మహేందర్‌రెడ్డి, గంగాడి సౌజన్య-తిరుపతిరెడ్డి, ఎంపీటీసీలు చదువు స్వరూప-నర్సింహారెడ్డి, జడల పద్మలత-రమేశ్ తదితరులు పాల్గొన్నారు. సైదాపూర్ మండలం దుద్దనపల్లి, ఎల బోతారం, ఎక్లాస్‌పూర్, ఘనపూర్ గ్రామాల్లో తహసీల్దార్ మంజుల, ఎంపీడీవో పద్మావతి ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. సర్పంచులు తాటిపల్లి యుగేంధర్‌రెడ్డి, కొత్త రాజిరెడ్డి, తడిసిన వెంకటరెడ్డి, మ్యాకల శిరీష, మామిడి మండలం ఇందుర్తి, గాగిరెడ్డిపల్లిలో ప్రజాపాలన కార్యక్రమాన్ని ఆర్డీవో మహేశ్వర్ తనిఖీ చేశారు. ఇందుర్తిలో 528, గాగిరెడ్డిపల్లిలో 291, గునుకులపల్లిలో 136 దరఖాస్తులను స్వీకరించారు. ఆయా చోట్ల ఎంపీపీ కొత్త వినీతాశ్రీనివాస్ రెడ్డి, జడ్పీటీసీ గీకురు రవీందర్, మండల ప్రత్యేకాధికారి నతానియల్, తహసీల్దార్ ఇప్ప నరేందర్, ఎంపీడీవో నర్సయ్య, ఎంపీవో శ్రవణ్ కుమార్, సర్పంచులు అందే స్వరూప, సన్నిళ్ల వెంకటేశం, గునుకుల అమూల్య ఉన్నారు. కరీంనగర్ రూరల్ మండలం నగునూర్, చెర్లభూత్కూర్ గ్రామాల్లో సర్పంచులు ఉప్పుల శ్రీధర్, దబ్బెట రమణారెడ్డి అధ్యక్షతన గ్రామ సభలు నిర్వహించారు. తహసీల్దార్ నవీన్‌కుమార్, ఎంపీడీవో దివ్యదర్శన్ రావు, ఎంపీవో జగన్‌మోహన్‌రెడ్డి, విద్యుత్ ఏఈలు శ్రీనివాస్, ఆనంద్, వైద్యాధికారులు సూర్యప్రకాశ్, మనోహర్, ఏఈవో ప్రణయ్, పీఆర్ ఏఈ రమణారెడ్డి, ఎంపీవో భార్గవ్, మండల వ్యవసాయాధికారి సత్యం, ఏపీవో శోభారాణి, ఎంఈవో మధుసూదన్, పంచాయతీ కార్యదర్శులు వాజిద్, మల్లయ్య, మాజీ సర్పంచ్ లక్ష్మణ్, వార్డు సభ్యుడు విక్రమ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. నగునూర్‌లో 741, చెర్లభూత్కూర్‌లో 646, చామనపల్లిలో 185, బొమ్మకల్‌లో 1194 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీవో దివ్యదర్శన్ రావు తెలిపారు. మానకొండూర్ మండలం కొండపల్కల, గంగిపల్లి గ్రామాల్లో ప్రజాపాలన కార్యక్రమాన్ని అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్ పరిశీలించారు. ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తు చేసుకునేందుకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని అధికారులకు సూచించారు. కొండపల్కలలో 1028, గంగిపల్లిలో 1142 మొత్తం 2170 దరఖాస్తులు వచ్చినట్లు టీమ్ ఇన్‌చార్జి ఎంపీడీవో రాజేశ్వర్ రావు, సూపరింటెండెంట్ వర ప్రసాద్ తెలిపారు. సర్పంచులు నల్ల వంశీధర్ రెడ్డి, మాశం శాలిని, ఎంపీటీసీలు రంగు భాస్కరాచారి, చలిగంటి సంపత్, ఉప సర్పంచ్ తాళ్లపల్లి సంపత్ తదితరులు పాల్గొన్నారు. రామడుగు మండలం వెదిర గ్రామంలో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమాన్ని అదనపు కలెక్టర్ ప్రపుల్ దేశాయ్ పరిశీలించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ కలిగేటి కవిత ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. చొప్పదండి మండలం చిట్యాలపల్లి, దేశాయ్‌పేట, గుమ్లాపూర్ గ్రామాల్లో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమానికి ఎంపీపీ చిలుక రవీందర్, మున్సిపల్ పరిధిలోని 1,2,3,4,5,6వ వార్డుల్లో నిర్వహించిన కార్యక్రమానికి కమిషనర్ శాంతికుమార్ హాజరయ్యారు. ప్రజలు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల ఇన్‌చార్జి దేవేందర్, తహసీల్దార్ నరేందర్, ఎంపీడీవో స్వరూప, ఎంపీవో రాజగోపాల్, సర్పంచులు గుడిపాటి సురేశ్, గుంట రవి, అప్పిడి సౌజన్య, ఎంపీటీసీ వెల్మ విజయలక్ష్మి-శ్రీనివాస్‌రెడ్డి, కూకుట్ల తిరుపతి, బత్తుల లక్ష్మీనారాయణ, కౌన్సిలర్లు చేపూరి హేమ-సత్యనారాయణగౌడ్, బిజిలి అనిత, వడ్నూరి గంగరాజు, నలుమాచు జ్యోతి-రామకృష్ణ, అధికారులు పాల్గొన్నారు. తిమ్మాపూర్ మండలంలోని పర్లపల్లిలో 771, గొల్లపల్లిలో 212, బాలయ్యపల్లిలో 151 దరఖాస్తులను అధికారులు స్వీకరించారు.

కరీంనగర్‌లోని 9వ డివిజన్‌లో దరఖాస్తు తీసుకుంటున్న కార్పొరేటర్ ఐలేందర్ యాదవ్

## దివ్యాంగులకు ఫిజియోథెరపీ

చొప్పదండి, డిసెంబర్ 29: పట్టణంలోని భవిత సెంటర్‌లో శుక్రవారం ఫిజియోథెరపిస్ట్ విజయలక్ష్మి ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ఫిజియోథెరపీ చేశారు. కార్యక్రమానికి హాజరైన మండల విద్యాధికారి అంబటి వేణు కుమార్ మాట్లాడుతూ, ప్రతి శుక్రవారం అంగవైకల్యం కలిగిన వారికి భవిత సెంటర్‌లో ఫిజియోథెరపీ అందుబాటులో ఉంటుందని తెలిపారు. అంగవైకల్యం కలిగిన పిల్లల తల్లిదండ్రులు తమ పేరు నమోదు చేసుకొని ఈ సేవలను వినియోగించుకోవాలని సూచించారు.

## సద్వినియోగం చేసుకోవాలి

చిగురుమామిడి, డిసెంబర్ 29: గ్రామీణ ఉపాధి హామీ పథకం(ఈజీఎస్) నిధులను సద్వినియోగం చేసుకోవాలని అడిషనల్ డీఆర్డీవో సంధ్యారాణి పంచాయతీ పాలకవర్గాలకు సూచించారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం మండల ఈజీఎస్ సామాజిక తనిఖీ నిర్వహించగా, ఆమె హాజరై మాట్లాడారు. 2022- 23 సంవత్సరానికి గానూ 17 గ్రామ పంచాయతీలకు రూ.2.58 కోట్ల నిధులు కేటాయించినట్లు తెలిపారు. ఇందులో రూ.1.51 లక్షల అవకతవకలు జరిగినట్లు మండల సామాజిక తనిఖీలో వెలుగు చూసిందని చెప్పారు. మండలంలోని నలుగురు పంచాయతీ కార్యదర్శులతో పాటు ఫీల్డ్ అసిస్టెంట్లకు మెమోలు జారీ చేసి వాటిని రికవరీ చేయిస్తామన్నారు. ఈ సామాజిక తనిఖీలో ఎంపీపీ కొత్త వినీతాశ్రీనివాస్ రెడ్డి, ఎంపీడీవో నర్సయ్య, విజిలెన్స్ అధికారి వెంకట్ రెడ్డి, అంబుడ్స్‌మెన్ ఆడెపు లక్ష్మీనారాయణ, డిప్యూటీ తహసీల్దార్ కళావతి, క్వాలిటీ కంట్రోలర్ శ్రీధర్ రెడ్డి, ఎస్ఆర్పీ మహేశ్వర్, ఇన్‌చార్జి ఏపీవో రాజయ్య, టీపీలు వెంకటేశ్, అంజలి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## విద్యార్థికి అభినందన

కమాన్‌చౌరస్తా, డిసెంబర్ 29: జిల్లా కేంద్రంలోని పద్మనగర్‌లో గల పారమిత హెరిటేజ్ పాఠశాలలో పదో తరగతి విద్యార్థి శుభశ్రీ సాహూ సీఎన్‌బీసీ టీవీ18 ఆధ్వర్యంలో నిర్వహించిన స్కిల్ టైటాన్ గ్రాండ్ ఫినాలేలో పాల్గొని తృతీయ స్థానంలో నిలిచింది. అపూర్వ శర్మ (కన్సల్టెంట్, ప్రధాని ఆర్థిక సలహా మండలి), ఓఎల్ఎల్ సహ వ్యవస్థాపకుడు శ్రేయాన్ దాగా చేతుల మీదుగా రూ. రెండు లక్షల నగదు బహుమతి గెలుచుకున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రితేష్ మెహతా తెలిపారు. శుభశ్రీ సాహూని పారమిత విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఈ ప్రసాదరావు, డైరెక్టర్లు అభినందించారు.

## మాజీ ఎమ్మెల్యే పరామర్శ

చొప్పదండి, డిసెంబర్ 29: మున్సిపల్ మూడో వార్డు కౌన్సిలర్ మహేశుని సంధ్య తండ్రి వెంకటేశం గురువారం రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా, శుక్రవారం పార్థివ దేహానికి చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఆయన వెంట మాజీ జడ్పీటీసీ ఇప్పనపల్లి సాంబయ్య, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆరెల్లి చంద్రశేఖర్ గౌడ్ నాయకులు మహేశుని మల్లేశం, కొత్తూరి నరేశ్, మహేశ్ తదితరులున్నారు.

## కరీంనగర్ డీఈపై బదిలీ వేటు

- కార్పొరేటర్ల ఫిర్యాదుతో చర్యలు
- అవినీతి ఆరోపణలే కారణమని చర్చ?

కార్పొరేషన్, డిసెంబర్ 29 : కరీంనగర్ నగరపాలక సంస్థలో పని చేస్తున్న డీఈ మసూద్ అలీపై బదిలీ వేటు పడింది. ఆయనను ఆదిలాబాద్ మున్సిపాలిటీకి బదిలీ చేస్తూ ఇంజినీరింగ్ చీఫ్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, ఇటీవల పలువురు కార్పొరేటర్లు, వివిధ నాయకులు చేస్తున్న ఫిర్యాదులు, అవినీతి ఆరోపణలతో ఆయనపై బదిలీ వేటు పడిందన్న చర్చ ఇంజినీరింగ్ శాఖలో జోరుగా సాగుతున్నది. ముఖ్యంగా ఈ అధికారి తీరుపై ఆది నుంచి విమర్శలు వస్తూనే ఉన్నాయి. స్మార్ట్‌సిటీలో భాగంగా చేపడుతున్న అభివృద్ధి పనుల బాధ్యతలు కూడా ఈ డీఈ పరిధిలోనే ఉన్నాయి. అలాగే, సీఎం అస్యూరెన్స్ నిధులతో చేపడుతున్న అన్ని పనులు కూడా ఈయన పర్యవేక్షణలో సాగాయి. ఇంజినీరింగ్ విభాగంలో ఇతర డీఈలు ఉన్నా వారికి సివిల్ పనులకు సంబంధించి ఎక్కువగా బాధ్యతలు అప్పగించకుండా ఒక్క డీఈకే బాధ్యతలు ఇచ్చారన్న విమర్శలు కూడా ఉన్నాయి. అలాగే, ఇంజినీరింగ్ విభాగంలో ఉన్నతాధికారులతోపాటు, కింది స్థాయి ఉద్యోగులు, సిబ్బందిని కూడా ఇష్టంవచ్చినట్లు బెదిరించారన్న ఆరోపణలు ఉన్నాయి. పలు డివిజన్లలో చేపట్టిన పనుల్లో అడ్డగోలుగా ఎంబీ రికార్డులు చేసి బిల్లులు పెట్టారన్న విమర్శలు ఉన్నాయి. చౌరస్తాల సుందరీకరణ పనుల్లోనూ ఇష్టారాజ్యంగా అంచనాలు పెంచి బిల్లులు డ్రా చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. మరోవైపు ఇప్పటికే స్మార్ట్‌సిటీ పనులకు సంబంధించి హౌసింగ్‌బోర్డు కాలనీలో ఇటీవల విజిలెన్స్ అధికారులు తనిఖీ చేశారు. ఇలాంటి వాటిపై ఇప్పటికే బీఆర్ఎస్ కార్పొరేటర్ బండారి వేణు నగరపాలక అధికారులు, జిల్లా ఉన్నతాధికారులు, మున్సిపల్ రాష్ట్ర ఉన్నతాధికారులకు సైతం ఫిర్యాదులు చేశారు. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకొనే ప్రభుత్వం నుంచి బదిలీ ఉత్తర్వులు వచ్చాయని, అందుకే శుక్రవారమే డీఈని రిలీవ్ కూడా చేశారన్న చర్చ మున్సిపల్‌లో జోరుగా సాగుతోంది. రానున్న రోజుల్లో ప్రభుత్వం ఇంకా ఎలాంటి చర్యలు తీసుకుంటుందోనన్న చర్చ సాగుతోంది.

## ఆరోగ్య ఉప కేంద్రం సందర్శన

మానకొండూర్ రూరల్, డిసెంబర్ 29: మానకొండూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని అన్నారం సబ్ సెంటర్, వెల్‌నెస్ సెంటర్‌ను శుక్రవారం కేంద్ర బృందం సభ్యులు (నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ బృందం) డాక్టర్ శ్రీయరామ్ శర్మ, డాక్టర్ మానసింగ్ జాట్ సందర్శించారు. ఆరోగ్య కేంద్రంలో అందిస్తున్న వైద్య సేవలతో పాటు అన్ని రిజిస్టర్లను పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత, సర్పంచ్ బొట్ల కిషన్, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ జువేరియా, డీపీవో రవీందర్, క్వాలిటీ మేనేజర్ సాగర్, మానకొండూర్ పీహెచ్‌సీ డాక్టర్ బీ గోపాల్, డాక్టర్ అలేఖ్య, సీహెచ్‌వో రాజూనాయక్, సిబ్బంది నాగేశ్వర్, హెల్త్ సూపర్‌వైజర్ సరోజన, కిశోర్ కుమార్, మునీందర్, చంద్రకళ, విజయ, ఆశ వర్కర్లు లక్ష్మి, పుష్పలత, ఆర్.లక్ష్మి, కవిత తదితరులు ఉన్నారు.

## వాగులో మునిగి ఇద్దరి మృతి

మొగుళ్లపల్లి, డిసెంబర్29: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలంలోని వేములపల్లి గ్రామంలో వాగులోకి స్నానానికి వెళ్లిన బావబామ్మర్దులు నీటిలో మునిగి మృతి చెందారు. తాత ఏడాది మాసికం రోజు ఘటన జరుగడంతో గ్రామంలో బంధువుల రోదనలతో విషాదం అలుముకుంది. ఎస్సై శ్రీధర్, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన తాటిపాముల రాజిరు గతేడాది మృతి చెందాడు. శుక్రవారం ఆయన కొడుకు సుధాకర్ ఏడాది మాసికం నిర్వహణకు బంధువులను ఆహ్వానించాడు. ఈ క్రమంలో సుధాకర్ కొడుకు తాటిపాముల పవన్‌కుమార్(27), జమ్మికుంట మండలం కనగర్తి గ్రామానికి చెందిన రాజిరు బిడ్డ కొడుకు సిరిమల్ల శ్రీకాంత్(18) స్నానానికి వాగుకు వెళ్లారు. నీళ్లలో దిగగా అక్కడ లోతు బాగా ఉండడంతో మునిగి మృతి చెందారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు పోలీసుల సహకారంతో మృతదేహాలను బయటకు తీశారు. కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. మృతుల బంధువు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## విద్యార్థులకు బంగారు పతకాలు

కమాన్‌చౌరస్తా/గంగాధర, డిసెంబర్ 29 : గంగాధరకు చెందిన చొప్పదండి స్రవంతి, కరీంనగర్‌కు చెందిన బాసని కవిత ఇటీవల వెలువడిన అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ పరీక్షా ఫలితాల్లో యూనివర్సిటీ పరిధిలో అత్యధిక మార్కులు పొంది రెండు చొప్పున బంగారు పతకాలు సాధించారు. గురువారం జరిగిన అంబేద్కర్ యూనివర్సిటీ 25వ స్నాతకోత్సవంలో యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ సీతారామారావు, తదితరులు బంగారు పతకాలను ప్రదానం చేయగా, ఈ సందర్భంగా వారిని పలువురు అభినందించారు.

## హాస్టల్‌కు వెళ్లడం ఇష్టం లేక..

- హైదరాబాద్ వెళ్లిన బాలిక
- జూబ్లీ బస్టాండ్‌లో చేరదీసిన పోలీసులు
- వివరాలు వెల్లడించిన కరీంనగర్ రూరల్ ఏసీపీ

రాంనగర్, డిసెంబర్ 29 : రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన బాలిక అదృశ్యమైన ఉదంతం ఎట్టకేలకు సుఖాంతమైంది. పెద్దపల్లి నుంచి కరీంనగర్‌కు రావాల్సిన బాలిక ఈ నెల 27న బొమ్మకల్ ఫ్లై ఓవర్ వద్ద బస్సు దిగి కనిపించకుండా పోయింది. ఈ ఘటనపై బాలిక తండ్రి నరసింహం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన కరీంనగర్ రూరల్ పోలీసులు ఐదు బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు ప్రారంభించారు. బాలిక గురువారం రాత్రి సికింద్రాబాద్ జూబ్లీ బస్టాండ్‌లో దొరకడంతో కరీంనగర్‌కు తీసుకువచ్చిన రూరల్ పోలీసులు చికిత్స కోసం దవాఖానలో చేర్పించారు. ఈ సందర్భంగా రూరల్ ఏసీపీ కరుణాకర్‌రావు పోలీస్ స్టేషన్‌లో మీడియాతో మాట్లాడారు. సెలవులు రావడంతో బాలిక తన అమ్మమ్మ ఇంటికి వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో హాస్టల్‌కు వెళ్లడం ఇష్టం లేక బొమ్మకల్ ఫ్లైఓవర్ వద్ద దిగి వేరే బస్సు ఎక్కి హైదరాబాద్‌కు వెళ్లింది. అయితే, అదే రోజు బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి ప్రత్యేక బృందాలతో దర్యాప్తు చేపట్టగా సీసీ పుటేజీల ద్వారా హైదరాబాద్ జూబ్లీ బస్టాండ్‌లో తిరిగినట్లు ఆధారాలు లభ్యమయ్యాయి. కాగా, సదరు బాలిక ఇంటికి వెళ్లేందుకు భయపడి ఉచిత ప్రయాణ సౌకర్యం ఉండడంతో జగిత్యాల, నిజామాబాద్, కామారెడ్డి, వరంగల్ బస్సుల్లో తిరుగుతూ చివరకు గురువారం రాత్రి మళ్లీ జూబ్లీ బస్టాండ్‌కు చేరుకుంది. అయితే, అప్పటికే ఆర్టీసీ బస్టాండ్‌లో సీసీ పుటేజీలు పరిశీలించిన పోలీసులు జూబ్లీ బస్టాండ్‌లో నిఘా వేయడంతో అక్కడికి వచ్చిన బాలికను చేరదీశారు. అనారోగ్యంగా ఉండడంతో తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చి దవాఖానకు తరలించారు. 36 గంటల్లోనే కేసును ఛేదించి బాలికను క్షేమంగా తీసుకువచ్చిన రూరల్ సీఐ ప్రదీప్, ఎస్ఐ వెంకట రాజం, సిబ్బంది దయానంద్, అంజయ్య, తిరుపతి, రాజేందర్‌ను ఏసీపీ అభినందించారు.

## కారు ఢీకొని వృద్ధుడి మృతి

తిమ్మాపూర్, డిసెంబర్29: మండలంలోని కొత్తపల్లి శివారులో రాజీవ్ రహదారిపై ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొన్న ప్రమాదంలో పురం కనకయ్య (65) అనే వృద్ధుడు మృతిచెందాడు. మండలంలోని జూగుండ్ల గ్రామానికి చెందిన పురం రాజలింగు, కనకయ్య అనే ఇద్దరు వ్యక్తులు తమ ద్విచక్ర వాహనంపై చిగురుమామిడి మండలం రామంచ గ్రామం వైపు వెళ్తుండగా, కొత్తపల్లి శివారులో వారిని వెనుక నుంచి వచ్చిన కారు ఢీకొన్నది. ఇద్దరూ కిందపడిపోయారు. ప్రమాదంలో రాజలింగుకు గాయాలు కాగా, పురం కనకయ్య తీవ్రగాయాలతో అక్కడికక్కడే మరణించాడు. సమాచారం అందుకున్న ఎల్ఎండీ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కరీంనగర్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కారు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రమోద్ రెడ్డి తెలిపారు.

## అయ్యప్ప దీక్షాపరులకు అన్నదానం

అయ్యప్ప స్వాములకు వడ్డన చేస్తున్న ట్రస్ట్ బాధ్యులు

కమాన్‌చౌరస్తా, డిసెంబరు 29 : జిల్లా కేంద్రంలోని శాస్త్రిరోడ్‌లో మతీన్ అండ్ ఫ్రెండ్స్ చారిటబుల్ ట్రస్టు బాధ్యులు శుక్రవారం అయ్యప్ప దీక్షాపరులకు భిక్ష ఏర్పాటు చేశారు. అంతకు ముందు గురు స్వాములు గుండ రాధాకిషన్, వరాల నరేందర్, వేముల విష్ణు, శ్రీనివాస్, బత్తిని సత్యం ఆధ్వర్యంలో అయ్యప్ప పడిపూజ వైభవంగా నిర్వహించారు. ట్రస్టు కార్యదర్శి ఎంఏ మతీన్, కార్పొరేటర్ వంగల శ్రీదేవి-పవన్‌కుమార్, నాయకులు వరాల జ్యోతి, పెద్ది వేణు, నగునూరి వేణు, ఇమామొద్దీన్, సాజిద్, హరికుమార్, మాడిశెట్టి రాము, అహ్మద్ హుస్సేన్, దారులై ఖైర్ సొసైటీ బాధ్యులు పాల్గొన్నారు.

## బల్దియా సర్వసభ్య సమావేశం వాయిదా

కార్పొరేషన్, డిసెంబర్ 29: ప్రజాపాలన కార్యక్రమం కొనసాగుతున్న దృష్ట్యా శనివారం నిర్వహించాల్సిన కరీంనగర్ బల్దియా సర్వసభ్య సమావేశం వాయిదా వేసినట్లు మేయర్ యాదగిరి సునీల్ రావు తెలిపారు. బల్దియా అధికారులు, సిబ్బంది ప్రజాపాలన కార్యక్రమం విధుల్లో ఉన్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. ప్రజాపాలన క